

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

పనులు నాణ్యతగా చేపట్టాలి : కార్పొరేటర్

చంపాపేట, మే 29(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చంపాపేట డివిజన్ మారుతీనగర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.1.17లక్షల కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ గురువారం జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాన్స్‌కో, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో అడ్డంగా ఉన్న ర్యాంపులు, మెట్లు, విద్యుత్ పోల్స్‌ను తొలగించాలని అధికారులను కోరారు. సీసీ రోడ్డు నిర్మాణంలో వాల్ టూ వాల్ చేపట్టాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ గోపాలకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, జలమండలి మేనేజర్ రమ్యభారతి, సిబ్బంది మినాజ్, రాములు, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు ఎం.రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి నవీన్, మాజీ అధ్యక్షుడు గుమ్మకొండ రఘునందన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి తదితరులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సరూర్‌నగర్, మే 29(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్‌లోని శ్రీలక్ష్మీ ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.35లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది గురువారం ప్రారంభించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి కాలనీ ప్రతినిధులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పదవిలో ఉన్నప్పుడు ఈ నిధులు మంజూరు చేయించానని, ప్రస్తుతం పనులు మొదలైనందున త్వరలోనే స్థానికులకు రోడ్డు అందుబాటులోకి రానున్నదని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మురళీధర్‌చారి, రఘువీర్‌ప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు చాపల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ ఆలయ ప్రాంగణంలో నూతన పాలకమండలి సభ్యులకు ఆర్డర్ కాపీలను అందజేస్తున్న ఆలయ ఈవో లావణ్య

31న పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం

చంపాపేట, మే 29(ఆంధ్రజ్యోతి): అతిపురాతనమైన కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంకు తెలంగాణ ప్రభుత్వం నూతనంగా నియమించబడిన పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎస్.లావణ్య తెలిపారు. పాలకమండలి సభ్యులుగా నియమితులైన వారికి ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ ఆర్డర్ కాపీలను ఈవో గురువారం అందజేశారు. ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ఉదయం 11:30గంటలకు రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సమక్షంలో పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహించనున్నట్లు ఈవో పేర్కొన్నారు.



పారిశుధ్య సమస్యలపై మాట్లాడుతున్న కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి

పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలి : రాగుల

వనస్థలిపురం, మే 29(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు మరింతగా కృషి చేయాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ శక్తినగర్‌లో గురువారం పారిశుధ్య కార్మికుల అవగాహన కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పారిశుధ్య కార్మికులు ప్రతి కాలనీలో చెత్త, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థ పదార్థాలు లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అదేవిధంగా కాలనీవాసులు ఇంట్లో చెత్తను ఖాళీ ప్లాట్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చెత్త వాహనాల్లోనే వేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసేవారిని గుర్తించి వారికి జరిమానాలు సైతం విధించాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్-4 డీసీ ఇస్లావత్ సేవాలాల్, ఏఈ విగ్నేశ్వరీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



థీమ్‌పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, అధికారులు

థీమ్ పార్కు పనులు నాణ్యతతో చేపట్టాలి

వనస్థలిపురం, మే 29(ఆంధ్రజ్యోతి): మహిళా థీమ్ పార్కు పనులు నాణ్యతతో చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ ఎన్జీవోస్ కాలనీలో నూతనంగా చేపడుతున్న థీమ్ పార్కు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఆరోగ్యం దృష్ట్యా చేపడుతున్న థీమ్ పార్క్ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో చేపట్టాలన్నారు. వీలైనంత త్వరగా పార్కు పనులు పూర్తిచేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ రమేష్‌బాబు, డీఈ దామోదర్‌రావు, జలమండలి డీజీఎం రాజ్‌గోపాల్, ఏఈ రాజ్‌కుమార్, జలమండలి మేనేజర్ భవ్య, కాలనీవాసులు వర్ధిని, వాణి పాల్గొన్నారు.

న్యూఅజయ్‌నగర్ నూతన కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బండ్లగూడలోని న్యూఅజయ్‌నగర్‌కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా బీవీ రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రాజాచారి, ప్రధాన కార్యదర్శిగా కుండే విఠల్‌రావు, జాయింట్ సెక్రటరీగా సంపత్, ట్రెజరర్‌గా వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మారోజు రవికుమార్, వాసుదేవరావు, బాలచందర్, గూడూరు అశోక్, గుజ్జ అశోక్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కాలనీ అభివృద్ధికి పాటుపడతామన్నారు.

మూసారాంబాగ్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

● వరద నీటితో ముంచెత్తుతున్న ప్రాంతాల పరిశీలన

చాదర్‌ఘాట్, మే 29(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న గురువారం ఆకస్మికంగా పర్యటించారు. అకాల వర్షాలతోపాటు నైరుతి రుతుపవనాల కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో వరద నీరు నిండిపోయి రోడ్లను ముంచెత్తుతున్న తీరుపై మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి జోనల్ కమిషనర్ వెంకన్నకు ఫిర్యాదు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఒకటైన మూసారాంబాగ్ సాయినగర్‌కాలనీలోకి సలీంనగర్‌లోని వివధ కాలనీల నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఇటు వాహనాలతోపాటు కాలనీలోని కుటుంబీకులు ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. వరద నీటి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్త చెదారం తొలగింపులో జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఇంజనీరింగ్ విభాగం అధికారులు తీవ్ర నిర్లక్ష్యవైఖరిని అవలంబిస్తున్నారని కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు.



జోనల్ కమిషనర్ వెంకన్నకు మూసారాంబాగ్‌లో వరద ప్రవాహం ఉన్న ప్రాంతాలను చూపిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి

సలీంనగర్ నుంచి మూసారాంబాగ్ బస్తీ మీదుగా ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీ, శాలివాహనకాలనీల మీదుగా మూసీ వరకు ఉన్న బాక్స్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన పూడికతీత పనులు పూర్తిగా నత్తనడకన సాగుతున్నాయన్నారు. బాక్స్ డ్రెయిన్‌ల నుంచి తొలగించిన పూడికను అక్కడ పారవేయడంతో వర్షం వచ్చే వరద ప్రవాహానికి తిరిగి అందులోనే చేరుతుందని, దీంతో వరదనీరు పోయేందుకు ఆటంకం ఏర్పడి రోడ్లన్నీ వరద నీటి ప్రవాహంతో నిండిపోతుందన్నారు. అదేవిధంగా శాలివాహననగర్ మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి చౌరస్తాలో వరదనీరు భారీగా చేరుతుందని, అక్కడున్న మ్యాన్‌హోల్స్‌ను ఎత్తుగా నిర్మించడంతో వరదనీరు పోయేందుకు వీలులేక రోడ్లపైనే మోకాలి లోతు వరకు వచ్చి చేరుతుందన్నారు. శాలివాహననగర్‌కాలనీ, ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీ, వెస్ట్ ప్రశాంత్‌నగర్, ఫ్రెండ్స్‌కాలనీ, ప్రతాపనగర్‌కాలనీ, సాయినగర్‌కాలనీ, మూసారాంబాగ్ బస్తీలోని వరద నీటి కాలువల్లోని పూడికతీత పనులు ఇంతవరకు పూర్తి కాలేదని కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే వీలైనంత త్వరగా వరదనీటి కాలువల్లోని పూడికతీత పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జోనల్ కమిషనర్ వెంట సర్కిల్-6 డీసీ జయంత్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్‌కుమార్ పటేల్ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, మే 29(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో వైద్య చికిత్సలకు అయిన వాస్తవ ఖర్చును ప్రామాణికంగా తీసుకుని సీఎం సహాయ నిధి పథకం కింద ఆర్థిక సాయం మంజూరు చేయాల్సిన అవసరం ఉన్నదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు(రోగులకు) తక్కువ మొత్తంలో మంజూరు చేస్తున్న సాయం ఏ మూలకూ సరిపోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను గురువారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, వారి వైద్యానికి అయిన ఖర్చులో దాదాపు 70 నుంచి 80శాతం ఆర్థిక సాయం అందజేసేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.లక్ష లోపే ఆర్థిక సాయం మంజూరు చేస్తూ చేతులు దులుపుకుంటున్నదని, దాంతో పేదలు అప్పుల పాలవుతున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రి బిల్లులను ప్రామాణికంగా తీసుకుని ఆర్థిక సాయం మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ గుర్రం సాయికిరణ్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు సంరెడ్డి వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, ఈఎల్‌వీ అశోక్ పాల్గొన్నారు.

గండిచెరువుకు అదనపు బస్సులు ఏర్పాటు చేయండి

● డిపో మేనేజర్‌కు సీపీఎం వినతి

హయత్‌నగర్, మే 29(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గండిచెరువు గ్రామానికి ఆర్టీసీ అదనపు బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో హయత్‌నగర్- 1, 2 ఆర్టీసీ డిపో మేనేజర్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ గండిచెరువు గ్రామానికి ఉదయం 8గంటలకు ఒక బస్సు వస్తుందని తెలిపారు. ఆ తర్వాత సాయంత్రం 5గంటల వరకు బస్సు సౌకర్యం లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. గ్రామానికి మధ్యాహ్నం బస్సులు నడిపించాలని కోరారు. కరోనా తర్వాత బస్సుల సంఖ్యను తగ్గించారని అన్నారు. గ్రామం నుంచి పెద్దఅంబర్‌పేట్, కొహెడా, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాలకు చేరుకోవడం కష్టంగా మారిందని అన్నారు. ప్రజల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు గండిచెరువు గ్రామానికి అదనపు బస్సులు నడపాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిపో మేనేజర్ వెంకటేశం, దేవేందర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు శ్రీరాంమూర్తి, మల్యాద్రి, భాగ్యలక్ష్మి, అనిత, అన్నపూర్ణ, రాణి, భార్గవి, బాలమ్మ, నస్రీన్, రాజేశ్వరీ, అనురాధ పాల్గొన్నారు.



గండిచెరువుకు బస్సుల సంఖ్య పెంచాలని ఇన్‌చార్జి డిపో మేనేజర్ వెంకటేశంకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం కార్యదర్శి నర్సింహ



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సుందరరామయ్య

ఎన్టీఆర్‌కు నేతల నివాళి

సరూర్‌నగర్, మే 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు, ఏపీలో జరుగుతున్న టీడీపీ మహానాడును పురస్కరించుకుని గురువారం మీర్‌పేట్‌లోని శివాలయం వద్ద టీడీపీ నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా టీడీపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సుందరరామయ్య, ఆర్.అంబికానాథం, మాణిక్యంరెడ్డి, వాసుసాగర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాక్స్‌డ్రైన్ పనులు వేగవంతం చేయాలి

ఓల్డ్‌మలక్‌పేట, మే 29(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో చేపడుతున్న బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంఐఎం మలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు షఫీయుద్దీన్ కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్‌లో పలు కాలనీల్లో మూడున్నర కోట్ల రూపాయలతో బాక్స్‌డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. గురువారం ఆయన కృష్ణ హస్పత్రి ప్రాంతంలో జరుగుతున్న బాక్స్‌డ్రైనేజీ పనులను పర్యవేక్షించారు. డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. వర్షం వచ్చినప్పుడు వరద తాకిడి అధికంగా ఉండే ప్రాంతాల్లో వరదను మూసీ నదిలోకి మళ్లించే విధంగా బాక్స్‌డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీ నిర్మాణ పనులు దాదాపు పూర్తికావచ్చాయన్నారు. ఆయన వెంట అధికారులు నాయకులు తదితరులున్నారు.



బాక్స్‌డ్రైనేజీ పనులు పర్యవేక్షిస్తున్న ఎంఐఎం అధ్యక్షుడు షఫీయుద్దీన్

తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. ఘరానా దొంగ అరెస్ట్

● చోరీ సొత్తుతో జల్సాలు, బెట్టింగ్‌లు, డైలీ ఫైనాన్స్

● రూ. 20 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను పహాడిషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎల్బీనగర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ గాజులపేటకు చెందిన అల్లం శివ(27) కొంత కాలం క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అంబర్‌పేట బతుకమ్మకుంటలో ఉంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం, గంజాయికి అలవాటుపడ్డ ఇతడు తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి, చోరీలు చేశాడు. వ్యసనాలతోపాటు విలాసాల కోసం ఇతడు చోరీల బాటపట్టాడు. అంబర్‌పేట్, వెల్దండ, ఉర్కొండ, మిడ్జిల్, మంచాల, కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 9దొంగతనాలు చేశాడు. ఈ కేసుల్లో పోలీసులు శివను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి 2024 అక్టోబర్‌లో విడుదలైన ఇతడు డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. బెట్టింగ్‌లకు, వ్యసనాలకు డబ్బు సరిపోకపోవడంతో తిరిగి చోరీలు చేయడం ప్రారంభించాడు. పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్, హయత్‌నగర్, ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఏడు ఇళ్లలో చోరీలు చేశాడు. చోరీ చేసిన అనంతరం కేటీఎం బైక్‌పై పరారయ్యేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పహాడిషరీఫ్ పోలీసులు నిందితుడిని గుర్తించారు. చోరీ సొత్తును విక్రయించే ప్రయత్నంలో ఉండగా కాపుకాసిన పోలీసులు షాలిబండ క్రాస్‌రోడ్స్ వద్ద నిందితుడు శివను గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ. 20 లక్షల విలువైన 13 తులాల బంగారు నగలు, 41 తులాల వెండి నగలు, రూ. 50వేలు, కేటీఎం బైక్, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసులు ఛేదించిన పోలీసులను సీపీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, డబ్బు



కార్యదర్శికి పార్టీ మినిట్స్ బుక్‌ను అందజేస్తున్న పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి

సీపీఐ ఆర్‌ఎన్‌ఆర్‌కాలనీ కార్యదర్శిగా నర్సింహ

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్‌ఎన్‌ఆర్‌కాలనీ సీపీఐ శాఖ మహాసభ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం ఆర్‌ఎన్‌ఆర్‌కాలనీ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ నూతన కార్యదర్శిగా యేశాల నర్సింహ, సహాయ కార్యదర్శులుగా దండుగుల మాసయ్య, కలమంద కాశీం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మహాసభలో ప్రకటించారు. మరో 18మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ పేదల కోసం నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. మాజీ కౌన్సిలర్లు పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రమాదపు అడుగులు





దిల్‌సుఖ్‌నగర్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జికి లిఫ్ట్ ఏర్పాటు చేయకపోవడం, బస్‌స్టాప్‌కి దూరంగా ఉండడంతో రోడ్డు డివైడర్ పై నుంచి ప్రమాదకరంగా దాటుతున్న మహిళలు, వృద్ధులు



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న డీసీపీ లావణ్య

విద్యార్థులు పుస్తకాలపై ఆసక్తి పెంచుకోవాలి: డీసీపీ

చాదర్‌ఘాట్, మే 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ స్క్రీన్ టైంను తగ్గించుకుని ఉజ్వల భవిష్యత్తు కోసం పుస్తకాలతో స్నేహం చేయాలని మహిళా భద్రత విభాగం డిప్యూటీ పోలీసు కమిషనర్ డాక్టర్ లావణ్య అన్నారు. గురువారం మలక్‌పేటలోని డాన్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీలో విజయం సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లను గరిష్టంగా ఒక గంట సేపు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యావేత్త హబీబ్ సల్మానీ, విద్యావేత్త మహ్మద్ అబ్దుల్ వాజిద్ పత్తాహ్, డాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహమాన్ ఖుర్రమ్, ప్రధానోపాధ్యాయురాలు ఆరిఫా, షిజియుల్లా షిరాసత్, డాక్టర్ సుశేణ్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

ఎస్సీ గురుకులాల సెక్రెటరీని సస్పెండ్ చేయాలి

చాదర్‌ఘాట్, మే 29(ఆంధ్రజ్యోతి): దళిత పిల్లల చేత వెట్టి పనులు చేయించేందుకు ఒడి గట్టిన తెలంగాణ ఎస్సీ గురుకులాల సెక్రెటరీ అలుగు వర్షిణిని వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టుడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మూసారాంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ, గ్రేటర్ నాయకులు పవన్, సునీల్, నందు, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్ దళిత జాతిని అవమానపరచిన వర్షిణిపై సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వర్షిణి వింత ప్రవర్తన దళిత జాతికి నష్టం కలుగుతుందన్నారు.



టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమేశ్ తదితరులు

టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

సరూర్‌నగర్, మే 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని జలవిహార్‌లో ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్న టీజేఎఫ్(తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్) 25 వసంతాల వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజేఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గాదం రమేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రజలను చైతన్యపరచడంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించారని అన్నారు. టీజేఎఫ్ రజతోత్సవాల్లో రంగారెడ్డి జిల్లా నుంచి జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీజేఎఫ్ నాయకులు సతీశ్‌యాదవ్, జంగయ్యగౌడ్, కృష్ణ, వినయ్, మోహన్, సురేశ్, గణేశ్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న జంగయ్య, శ్రీధర్

ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శం

సరూర్‌నగర్, మే 29(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శంగా నిలువనున్నదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బాల్‌నింగని జంగయ్య, సెల్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్ పేర్కొన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ 15వ డివిజన్ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సాయం మంజూరు కాగా, గురువారం ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జంగయ్య, శ్రీధర్ మాట్లాడుతూ పథకంలో ఎంపికైన లబ్ధిదారులు సొంత ఇంటిని నిర్మించుకుని ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రమేశ్, నాయకులు నరహరిగౌడ్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ పాలక మండలి సభ్యురాలిగా కవిత



కవిత

వనస్థలిపురం, మే 29(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ పాలక మండలి సభ్యురాలిగా వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్యనగర్ కాలనీకి చెందిన కంచర్ల కవిత నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం కవిత మాట్లాడుతూ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సహకారంతో ప్రసిద్ధ కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ కమిటీ డైరెక్టర్‌గా తనకు అవకాశం లభించడం సంతోషకరం అన్నారు. ఆలయ అభివృద్ధికి, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.